# ఇండిపెండెంట్స్ డే

ప్రసన్నకుమార్ సర్రాజు



వీడియో చూస్తూ కూర్చున్నాడు ఇండిపెండెంటు. ఆయన ప్రక్కనే చూసిన సీనే మళ్ళీ రివైండు చేస్తూ, చూస్తూ కేరింతలు కొడుతున్నారు చిన్నా, మున్నీ. వాళ్ళిద్దరూ ఆయన స్వొయంగా కన్న డిపెండెంట్లు. అంటే ఆయన పిల్లలు. మాటవరసకి డిపెండెంట్లుగానీ, ఆయనకన్నా స్ట్రాంగు ఇండిపెండెంట్లు.

"ఎవర్రా ఆళ్ళూ? అమెరికాని మింగెయ్యడానికి ఆకాశం కింద నీడలా వస్తున్నారు? రష్యన్లా ఏమిటి?" అడిగాడాయన.

డిపెండెంట్లకి కోపం వచ్చింది. అయినా కుర్చీలో ముదుచుకు కూర్చుని గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంది నాన్నారు కాబట్టి కొంచెం గౌరవంగానే-"ఇంకెక్కడి రష్యన్లు డాడీ! వాళ్ళెప్పుడో థర్డ్ వరల్డ్ కంట్రీస్ కూడా దాటేసి ఫోర్తు వరల్డు లిస్టులో పడ్డారు. పుడ్డు కూడా లేదు" అన్నారు.

"ఓహో! ఆహార ధాన్యాలకోసం మిడతల దండులా అమెరికా మీద పడ్డారన్నమాట" అన్నాడాయన.

"అబ్బ! కాదు డాడీ! వాళ్ళు ఏలియన్స్! అంటే పరగ్రహంనుంచి వచ్చారన్న మాట."

ఆశ్చర్యంగా "పరగ్రహమా! ఏ గ్రహం?" అడిగాడాయన.

"శనిగ్రహం..శనిగ్రహం..." అంటూ వచ్చింది ఇండిపెండెంటుగారి భార్య లక్ష్మీబాయి. ఆయన వులిక్కిపడి, మళ్ళీ సర్దుకు కూర్చుని, "ఏమయిందే? మళ్ళీ ఎవరిని తిడుతున్నావు?" అన్నాడు.

"మళ్ళీ తిట్టుకోవడానికి కొత్తగా ఎవరొచ్చారు? మిమ్మల్నే రెండు వారాల్లో ఢిల్లీ ప్రయాణం పెట్టుకుని చిన్న పిల్లాడిలా సినిమా చూస్తూ కూర్చుంటారా! హవ్వ.." అంది.

"పొద్దున రైల్వే బుకింగాఫీసుకి వెళ్ళొచ్చాగా? నెలదాకా రిజర్వేషన్లు లేవన్నాడు. పోనీ, ఎలాగో సర్దుకుని జనరల్ కంపార్టుమెంటులో పోతాలే..." నసిగాడాయన.

ఆవిడకు ఒళ్ళు మండిపోయింది. "ఆహా! అలాగా! ఢిల్లీ దాకా జనరల్ కంపార్టుమెంటులో కూర్చుని పోతారా? వెళ్ళేప్పుడు నాలుగు జొన్న రొట్టెలు, పండుమిరపకాయ పచ్చడి, ఉల్లిపాయ పెట్టి ఉట్టి కట్టిస్తాను. ఓ కర్రకి తగిలించి, భుజానేసుకుని నేరుగా పార్లమెంటులోకి పొండి..."

"అబ్బే-కూర్చుని ఎందుకు పోతానూ! రైలాగగానే బెర్తు మీద టవలు పరిచేస్తాగా!"

"ఖర్మ ఖర్మ...వుట్టింటోళ్ళు పెట్టిన నగలు కూడా తాకట్టెట్టి వేబడులు తీసుకొని ఎలాగో డిపాజిట్టు కట్టాను. జీవితంలో ఏ ఘనకార్యమూ చెయ్యకపోయినా కనీసం డిపాజిట్టు కోల్పోయిన అభ్యర్థుల జాబితా అని పేపర్లో మీ పేరు పడితే పోతే పోయింది డిపాజిట్టు అని ఇరుగూ పొరుగూకి చూపించుకుని సంబరపడదామనుకున్నాను. ఏదో ఆ రామచంద్రుడి దయవల్లా, ఆ అల్లా చల్లగా చూడటంవల్లా, ఆ లెనిన్ దయవల్లా ఆళ్ళూ ఆళ్ళూ గొడవపడి బాలెట్‌పేపర్లో మిగిలివున్న మీ ఒక్క పేరు మీద అంతా ఓట్లు గుద్దెయ్యడంవల్ల - మీలాంటి అనామకుల్ని కట్టుకొని పాతికేళ్ళుగా ఓర్పుతో సంసారం చేసినందుకు ప్రతిఫలం దొరికిందని నే సంబరపడుతూంటే..."

బయట టాక్సీ ఆగిన చప్పుడైంది. పిల్లలు పరగ్రహ వాసుల్ని కట్టేసి, తమ యింటికి వచ్చిన భూగ్రహవాసులెవరా అని ఆత్రుతగా బయటకు పరిగెత్తారు.

ఇండిపెండెంటు లేవలా. శనిగ్రహం వాళ్ళొస్తే ఏమవుతుందా అని ఆలోచనలో పడ్డాడు.

గుమ్మంలోంచే చిన్న రోదనలు వినబడ్డాయి. లక్ష్మీబాయి వాళ్ళ అమ్మ భుజం మీద వాలి వెక్కి వెక్కి ఏడుస్తోంది. వాళ్ళ నాన్న కూతుర్ని సముదాయిస్తున్నాడు.

"అమ్మా! ఆయన గెలిచారే. నా ప్రాణం తోడేస్తున్నారు"

"ఊరుకోమ్మా వూరుకో...ఏదో మెతకమని షిగదా అని పిల్లనిస్తే ఇంత అఘాయిత్యం చేస్తాడా! అసలు ఎవడినడిగి గెలిచాడు? గెలిచేముందు మాకు ఓ కార్డు ముక్క రాయాలన్న జ్ఞానం లేదా అల్లుడిగారికి?" వాళ్ళమ్మ బుజ్జగిస్తోంది.

మామగారు విసుక్కుంటూ సర్దుతున్నాడు. "ఊరుకోండి. ఏమిటిది? జరిగిందేదో జరిగిపోయింది. ఇక జరగవలసిన తతంగం సంగతేదో చూడాలి. ఒసేవ్! పిల్లలు చూడు. ఎలా బిక్కమొహం వేసుకుని నిల్చున్నారో! వాళ్ళ మొహం చూసయినా వూరుకోండి." అని తల్లీ కూతుళ్ళను లోపలికి పంపించి "ఎవరన్నా బ్రాహ్మలకి కబురు చేయండి" అని అరిచాడు. అప్పటికే ఇరుగుపొరుగువారు పోగయ్యారు. ఓ కుర్రాడు సైకిలు తీసుకొని 'నేను పిల్చుకొస్తాను' అని రయ్యిన వెళ్ళి పోయాడు.

మావఁగారు లోపలికి రాగానే ఇండిపెండెంటు లేచి నిల్చున్నాడు. చిన్నగా నవ్వ

బోయాడు. మావగారు అతన్ని చిరాగ్గా చూసి "కూర్చో...అని తను ఒక కుర్చీలో కూర్చుని, "ఊ...గెలిచావటగదా!..."అన్నాడు సూటిగా చూస్తూ.

ఇండిపెండెంటు తలవంచుకుని నిల్చున్నాడు.

"కూర్చో కూర్చో...ఎలక్షన్లో నిల్చున్నప్పుడే వుండాలి. ఇప్పుడెందుకూ?...కూర్చో" అన్నాడు. ఇండిపెండెంటు కూర్చున్నాడు.

అప్పుడే ఆటోలోంచీ ఇండిపెండెంటు బామ్మర్ది ఫ్యామిలీ కూడా దిగింది. లోపలికి రాగానే బామ్మర్ది పరిస్థితి అంచనా వేశాడు. బేలగా చూస్తూ గోడకి ఆనుకుని నిల్చున్న చెల్లెలికి ధైర్యం చెప్పి, భార్యకు చెప్పాడు వెళ్ళి పొయ్యి రాజేయమని.

బావదగ్గరకు వెళ్ళి "ఏంటి బావా ఈ పని? సర్లె సర్లె నువ్వూరుకో అన్నీ నే చూసుకుంటాలే" అని తండ్రిపక్కన కూర్చుని రహస్యంగా ఏదో మాట్లాడుతున్నాడు.

అదే సమయమని ఇండిపెండెంటు నెమ్మదిగా లేచి హాల్లో మధ్యలో వేసి వున్న చాపమీద వెల్లికిలా పడుకుని విశ్రాంతిగా కళ్ళు మూసుకున్నాడు.

బామ్మర్ది భార్య వంటింట్లోంచీ వచ్చి "ఇంకా బంధువులెవరన్నా రావాలా? ఎసరు పెడుతున్నాను" అంది.

బామ్మర్ది భార్యను విసక్కున్నాడు. "అప్పుడే ఎలా చెప్పగలం? పదమూడో రోజు దాకా ఎవరో ఒస్తూనే వుంటారు. పుణ్యావచనం, ప్రమాణ స్వీకారం అన్నీ అవాలిగదా!" అంటుంటే అరడజను మంది బ్రాహ్మలొచ్చారు.

"అయ్యా! అపరాహ్ణంవేళకి, తంతు అంతా ముగించాలి. ఇంకా రావాల్సిన వాళ్ళెవరైనా వున్నారా? స్నానం చేయించొచ్చా?" అడిగాడు ఓ బ్రాహ్మణపెద్ద.

ఇంతలో నలుగురు బ్రాహ్మలు ప్రొఫెషనల్‌గా చాపదగ్గరకెళ్ళారు.

"పాపం..ఎక్కువ వయసు లేదనుకుంటా" అంటూ ఇండిపెండెంటు చేతిగడియారం పుటుక్కున తెంచి, గోడకానుకుని కళ్ళొత్తుకుంటున్న లక్ష్మీబాయి చేతికిచ్చారు నిజాయితీగా. లక్ష్మీబాయి బిత్తరబోయింది. మాగన్నుగా నిద్రబోతున్న ఇండిపెండెంటు లేచి కూర్చున్నాడు. బ్రాహ్మలు తెల్లబోయారు. మావగారు లేచి 'నేను ఒకళ్ళో ఇద్దరో వస్తారనుకుంటే ఇంతమందొచ్చారేమిటయ్యా?" అని విసుక్కున్నాడు.

"ఇంతకీ తమరు కబురంపిందీ..." అంటూ నసుగుతున్నాడు బ్రాహ్మణ పెద్ద.

"అదుగో...ఆ చాపమీద కూర్చున్నాడే... మా అల్లుడు. 29 కల్లా డిల్లీలో వుండాలి. ఓ రెండు మూడు రోజుల నుండే, మంచి ముహూర్తం వుంటే పెట్టాలి" అన్నాడు.

అప్పుడే లోపలకు అడుగుపెట్టిన ఓ కాషాయాంబరధారి "శాస్త్రిగారూ! పక్కవీధిలో ఓ శాల్తీ మిస్ అయిందట. మీరు అక్కడకెళ్ళి పని చూడండి" అని బ్రాహ్మల్ని పంపించేసి, చనువుగా ఓ కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

"మీరు..."అన్నాడు మావcగారు.

"పేరెందుకులేండి...నేను ఢిల్లీనుంచే వచ్చాను. ఇండిపెండెంటుగారి ప్రయాణం, ఢిల్లీకి ఫ్లైటూ, అన్నీ నేనే ఎరేంజ్ చేస్తా. ఢిల్లీలో మకాం కూడా. రాచమర్యా



దలు జరిపిస్తా" అని వచ్చీ రాని తెలుగులో మాట్లాడి, జేబులోంచీ సెల్యూలార్ ఫోను తీసి ఢిల్లీ మాట్లాడుతున్నాడు హిందీలో. ఒక్కముక్క అర్థం కావడం లేదు అక్కడెవరికీ.

ఆయన ఫోను పెట్టేసి లక్ష్మీబాయితో - "అమ్మాయ్! ఫికర్ మత్ కరో. ఇండిపెండెంటుగారికి ఢిల్లీలో ఫైవ్‌స్టార్ హోటల్లో సూటు బుక్ చేశాను. వెంటనే సూటుకేసు సర్దు" అన్నాడు చిరునవ్వుతో.

మామగారు "అయినా ఇంత ఖర్చు మేం భరించుకోవటం..."

"భలేవారు! ఆప్ చింతా మత్ కరో. మొత్తం నేను చూసుకుంటాగదా!" అన్నాడు.

లక్ష్మీబాయి ఆనందంగా లోపలికెడుతూ "హుc...ఈ ముద్దావతారం ఎప్పుడన్నా ఊరు కదిల్తేనా! ఢిల్లీ పంపటానికి కనీసం ఓ కొత్త సూటుకేసు కూడా లేదు...పక్కింటి వాళ్ళను అడుగుతాను" అనుకుంటూ బయటకొచ్చి గేటు తీసింది.

"పాత సూటు కేసుకి కొత్త సూటుకేసు లిస్తాం" అని అరుస్తూ నిలబడ్డాడు ఒకాయన గేటు ముందరే. తెల్లగుడ్డ టోపీ. నల్లకోటు వేసుకుని వున్నాడు. లక్ష్మీబాయి ఆశ్చర్యంగా చూసింది.

ఏమిటో? పాత సామాన్లకి పాతభట్టలకీ స్టీలు సామాన్లిస్తారుగానీ పాత సూటుకేసుకి కొత్తదిస్తావా! నీకేం మతిపోయిందా? నేనేం అంత తెలివి తక్కువ దానిలా కనబడుతున్నానా? ఇలాంటి వాళ్ళని నమ్మకూడదు...వెళ్ళెళ్ళు...చెయ్యి ఖాళీగా లేదు. అలా పైకి పో" అంది. ఆ మనిషి ఒళ్ళంతా పళ్ళు చేసుకుని నవ్వుతూ-

"ఆహా! పొద్దున్నే ఎంత చల్లటి మాటన్నావ్ తల్లీ... 'చెయ్యి' ఖాళీగా లేకపోవటమే మాక్కావల్సింది." అని అటూ ఇటు చూసి తగ్గు స్వరంతో "మీవారు ఇండిపెండెంటేగదమ్మా?" అని అడిగాడు.

"అవును. అయితే ఏంటట?"

"మాతో 'చేయి' కలిపితే ఈ సూటుకేసులో వున్నదంతా మీదే" అని ఓ కొత్త సూటుకేసు అందించాడు.

ఇప్పటికి లక్ష్మీబాయికి విషయం కొంచెం కొంచెం అర్థమవుతూంది.

మొహం విప్పారుతుండగా, "మా ఇం(డిపెండెం)టాయనకి ఇంత విలువుందా? ఇంతకీ ఎంతుందిందులో?" అని అడిగింది.

"ఏ సూటుకేసులో ఎంతుందో ఎవరు చెప్పగలరమ్మా? అయినా మీ మంచి కోసం చెప్తున్నా. లోపల ఢిల్లీకి ఫ్లైటూ, బంగళాలో మకాం అని చెప్తున్నాడే ఆయన్ని తొందరగా పంపెయ్యండి" అని అప్పటికే పాత సూటుకేసులు పట్టుకుని క్యూలో నిల్చున్న వాళ్ళని వదిలించుకుంటూ "పాత సూటుకేసులకి అంతకన్నా డొక్కు సూటుకేసులిస్తాం" అని అరుచుకుంటూ వెళ్ళిపోయాడు.

లక్ష్మీబాయి లోపలికొచ్చి సూటుకేసు భద్రంగా దాచి అన్నయ్యను పిల్చి చెప్పింది. అతను థ్రిల్లయిపోయి "అప్పుడే తొందరపడి ఎవరికీ మాటివ్వకు. హరిశ్చంద్ర నాటకం చూశావుగదా! అది తిరగేసి, బావని వేలంపాటలో పెడదాం" అని గుసగుసగా చెప్పి హాల్లోకి వెళ్ళాడు.

"ఇస్‌లియే, మేము సూర్యకాంతంలాంటి వాళ్ళం. మా ఉద్యానవనంలోని సరస్సులో మీ అల్లుడుగారు పూర్తిగా నివశించేలా చూస్తాము" చెప్తున్నాడాయన.

ఇండిపెండెంటు మొగలాగా ముడుచుకు కూర్చున్నాడు. ఎప్పుడొచ్చాడో చాపమీద నుంచీ కుర్చీలోకి మారాడు.

బామ్మర్ది కలగజేసుకున్నాడు. "సూర్యకాంతం కాదు. సూర్యకాంతి. అయినా కలువలు వికసించాలంటే కావల్సింది చంద్రకాంతి. అద్సరే అసలు విషయానికి రండి. అస్‌లీ బాత్‌కో ఆయియే" అన్నాడు చిన్నపుడు స్కూల్లో చదువుకున్న హిందీ ప్రావీణ్యంతో.

"క్యామై నకిలీ బాత్ కర్ రహే హు? బహారో పూల్ బర్సావో మేరా మహబూబ్..." అంటూ లేచి ఇండిపెండెంటుని కావలించుకుని ముద్దు పెట్టుకున్నాడు.

లక్ష్మీబాయి బిర్రుగా చూసింది- "మా వారు ఆర్ఎంపీ డాక్టరేగానీ మీరనుకుంటున్నట్లు హోమోపతీ కాదు" అంది.

ఆయన "మేరీ ప్యారీ బెహనియా" అని

రెండు చేతులూ సాచి లక్ష్మీబాయి వేపు వెళ్ళసాగాడు. బామ్మర్ది ఆయన్ని అడ్డుకుని, "బహోత్ హోగయా. పైసలు ఎంతిస్తావ్...అద్వెప్పు ముందర" అని నిలదీశాడు.

"పైసలా? అభీతక్ పైసలా నహీ హువా. ఈ దేశం సమగ్రత కోసం హెల్ప్ చేయండి. భగవంతుడు మేలు చేస్తాడు. కావాలంటే ఇండిపెండెంటుగారి పేరు మీద సీతమ్మవారికి లక్షకుంకుమార్చన చేయిస్తాం" అన్నాడు.

"కుదర్దు. ఐదు లక్షల కుంకుమార్చన చేయించాలి" అన్నాడు బామ్మర్ది బింకంగా.

"మనలో మనకేటి భాయీ. మూడు లక్షల కుంకుమార్చన చేయిస్తాం" అన్నాడాయన గుంభనంగా.

"నాలుగున్నర లక్షల కుంకుమార్చన కంటే ఒక్క కుంకుమార్చన తగ్గినా ఒప్పుకోం" అన్నాడు బామ్మర్ది మొండిగా.

ఆయన దీనంగా "జరా సమఝ్‌నేకీ కోషిష్‌కరో. ఇప్పటికే కొన్ని లక్షల కుంకుమార్చనలు చేయించి, మా జబ్బలు బాగా వాచిపోయి, కాపడం పెట్టుకుంటున్నాం" అని "హేరామ్" అంటూ పడకకుర్చీలో కూలిపోయాడు.

అంతలోనే చిరిగిన పంచె, అతుకుల లాల్చీతో దబ్బపండల్లే వున్న ఓ బట్టతలాయన లోపలికి ప్రవేశించి పడక్కుర్చీలో పడుకున్న అతన్ని వెనకనుంచీ చూసి, జేబులోంచీ సెల్‌ఫోన్ తీసి నెంబరు నొక్కాడు. పడక్కుర్చీలోపడినాయన జేబులో సెల్‌ఫోను మోగింది. ఆయన తీసి "హాయి" అన్నాడు.

"మై..కాలాకృష్ణ బోల్ రహా హుం. ఏమయింది?" అన్నాడు.

పడక్కుర్చీ ఆసామీ "వీళ్ళు మొండి ఘటాల్లా వున్నారు. అస్సలు లొంగటం లేదు" అన్నాడు అచ్చ తెలుగులో.

"ఠీక్ హై...నీవల్లేమవుతుందిగానీ - మనకింక ఒక్కటే మెజార్టీ కావాలి. బయట ఆటో వుంది. నువ్వు వెంటనే ఆటో ఎక్కి ఢిల్లీ వెళ్ళిపో. నే చూసుకుంటాలే అన్నీ అన్నాడు కాలాకృష్ణ.

"ఆటోలో ఢిల్లీ పోవాలంటే చాలా రోజులు పడుతుందేమో" నసిగాడు.

"తుమ్హారా బొండ. నేరుగా ఎయిర్‌పోర్టుకు పో. బెస్టాఫ్ లక్" అని ఫోను మూసేసి ముందరికొచ్చి షేక్‌హ్యాండిచ్చాడు. అప్పుడే పడక్కుర్చీలోంచీ లేచి నిల్చున్నవాడు తెల్లబోయాడు. "మీరిక్కడే వున్నారా!" అన్నాడు.

"అవును. నేరుగా మాట్లాడితే లాబీలోమాట్లాడినట్లవుతుంది. పైగా లాబీయింగ్ అంటారు. అయినా సెల్‌ఫోన్లు రాకముందు కూడా అన్ని పార్టీల నాయకులు కూడా 'సెల్'లో మాట్లాడుకున్నవాళ్ళేగా! సరే నువ్వు బయల్దేరు" అని అతనెళ్ళిపోగానే ఇంట్లో అందరికీ వినయంగా దణ్ణం పెట్టాడు.

"ఎవరు మీరు?" అని అడుగుతూంటే ఇండిపెండెంటు అత్తగారు వచ్చింది. "నేనే పనిలోపెట్టా. పెరడంతా శుభ్రం చేసి కొత్త మొక్కలు నాటిపెడతానన్నాడు. ఓ పాతికిస్తే చాలన్నాడు " అంది అందరూ అయోమయంగా చూస్తుండగానే కాలాక్రిష్ణ పెరట్లోకి వెళ్ళిపోయి "మేరి దేశ్‌కి ధర్తీ" అని పాడుకుంటూ పెరడంతా దున్నసాగాడు.

టైము తొమ్మిదయింది. పిల్లలు స్కూలుకి బయల్దేరారు. బయట రిక్షా బెల్లు టింగ్ టింగ్‌మని మోగింది. 'బాబూరావు వచ్చినట్లున్నాడు' అని పిల్లల్ని తీసుకుని గేటు దగ్గరకు వెళ్ళింది లక్ష్మీబాయి.

"అదేమిటి? బాబూరావు రాలేదా? నువ్వెవ్వరివి?" అంది కొత్త మనిషిని చూసి.

"నేను చంద్రయ్యనమ్మా. బాబూరావు ఓ వారంపాటు రాడు. నన్ను పంపించాడు" అన్నాడతను.

"ఇలా కొత్త వాళ్ళతో పిల్లల్ని పంపం. అయినా నిన్ను బాబూరావు పంపాడనటానికి ఏమిటి గుర్తు?" అంది.

"ఇదిగోమ్మా సైకిల్ రిక్షా. ఇదే నా గుర్తు. రిక్షాకే మీ ఓటు" అన్నాడు చేతులు జోడించి.

"మొన్ననే గదా ఎలక్షన్లయ్యాయి? ఇంకేం ఓటు? సర్లే...ఇది బాబు రిక్షానే. నే గుర్తుపట్టాలే...జాగ్రత్తగా తీసికెళ్ళు పిల్లల్ని" అని లక్ష్మీబాయి వచ్చేస్తుంటే పెరట్లో కాలాక్రిష్ణ పని ఆపు చేసి ఎవరికో సైగలు చేస్తున్నాడు. లక్ష్మీబాయి పెరటిగోడచాటున నుంచోని చూస్తోంది. పొద్దున్నే పన్లో చేరిన కొత్త వంటమనిషి బావిదగ్గర పిల్లలు టిఫిన్లు చేసిన ప్లేట్లు కడుగుతోంది. పైనుంచీ కిందదాకా గౌనేసుకుని వుంది. బొద్దుగా ఆరోగ్యంగా వుందికదా అని, ఒళ్ళు దాచుకోకుండా పన్జేస్తుందని అనుకుంటే - ఏమిటోగోల అనుకుంది లక్ష్మీబాయి.

కాలిక్రిష్ణ "లెటర్...లెటర్..."అంటున్నాడు. ఆ అమ్మాయి మొండిగా చూస్తున్నది. సమాధానం చెప్పట్లేదు.

"ప్లీజ్...లెటర్ ఇవ్వకపోతే ఎలా? ఇదా టైము అలగడానికి?" అంటూ బతిమాలుతున్నాడు కృష్ణ.

"ఇస్తాగానీ, నా తరుపువాళ్ళందర్నీ మర్యాదగా చూసుకోవాలి. లేకపోతే నీకూనాకూ పచ్చి" అంటోంది.

అంతలో పిల్లలిద్దరూ వచ్చి "అమ్మా ఆటోకి డబ్బులివ్వు" అని అరిచారు. లక్ష్మీబాయి ఆశ్చర్యపోయి "అదేంట్రా ఆటోలో వచ్చారు? వెళ్ళి అరగంటకాలేదు? చంద్రయ్య ఏడీ? రిక్షాలో రాలేదేం? స్కూలు లేదా?" అని ప్రశ్నల వర్షం కురిపించింది.

"స్కూలుంది మమ్మీ. నా స్కూలు మెయిన్‌రోడ్డుకి లెఫ్ట్‌లో చాలా దూరం పోవాలగదా! చెల్లాయి స్కూలు మెయిన్ రోడ్డుకి రైట్‌లో చాలా దూరం పోవాలిగదా! కరక్టుగా మెయిన్‌రోడ్డు మధ్యలో రిక్షా ఆపు చేసి దిగిపొమ్మన్నాడు. చుట్టూతా బోల్డు ట్రాఫిక్. భయమేసి ఆటోలో ఇంటికొచ్చేశాం" అన్నాడు చిన్న.

లక్ష్మీబాయి కోపంగా "ఎందుకలామధ్యలో ఆపు చేశాడు?" అని అడిగింది.

"ఏమో మమ్మీ! అదేదో కొత్త తెలుగుమాట అన్నాడు. మా తెలుగువాచకంలో లేదు అని బుర్రగోక్కొని "ఆఁ..గుర్తొచ్చింది. ఆరు నూరైనా నూరు ఆరైనా తను అటుగానీ ఇటుగానీ పోడట...తటస్థంగా ఉంటానన్నాడు" అని చెప్పి బ్యాగులు మోసుకుంటూ ఇంట్లోకి వెళ్ళారు పిల్లలు.

ఫోను మోగుతుంటే లక్ష్మీబాయి హాల్లోకొచ్చింది. ఆమె తండ్రి ఫోన్లో అవతల్నించీ వచ్చిన మాటలు విని కాస్సేపు వణికి రిసీవర్ కొడుక్కిచ్చాడు. కొడుకు దర్పంగా "ఎస్ దిసీజ్ ఇండిపెండెంట్స్ బ్రదరిన్లా స్పీకింగ్"అన్నాడు. లక్ష్మీబాయికి ఏదో అనుమానమొచ్చి బెడ్‌రూమ్‌లో ఎక్స్‌టెన్షన్



ఫోన్ తీసి వింటోంది.

"యూ స్టుపిడ్ దిస్ కాల్ ఈజ్ ఫ్రమ్ ప్రెసిడెంట్స్ ఛాంబర్. హ్యాండ్ ఓవర్ ది ఫోన్ టు యువర్ బ్రదరిన్లా" అని ఖంగుమన్న కంఠంతో ఆదేశిస్తున్నట్లు వినిపించింది.

బ్రదరిన్లా ఖంగుతిని షేకయిపోతూ "బావగారూ!బావగారూ!!" అని పిలిచాడు. రాత్రి మిగిలిన చద్దన్నంలో మజ్జిగపోసుకుని ఆవకాయపచ్చడి అద్దుకొని నంజుకుంటూ అల్పాహారం చేస్తున్న ఇండిపెండెంటు యీ అరుపుల్ని పట్టించుకోలా.

"బావగారూ! ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా నుంచీ మీకు ఫోను" వీధి మొత్తం వినిపించేలా అరిచాడు బామ్మర్ది.

పెరట్లో పని చేసే కృష్ణ, లెటర్ గురించి మొండికేసిన లావుపాటి ఆవిడా, ఇంతకు ముందే కొత్త సూటుకేసు ఇచ్చి అక్కడే తచ్చాడుతున్న తెల్లటోపీ ఆయనా, రిక్షా మీద అటేపెడుతూ ఈ గావుకేక విన్న చంద్రయ్యా అంతా హాల్లో గుమిగూడారు. కళ్ళ జోడు పెట్టుకున్న ఓ పిల్లిగడ్డం ఆయనకూడా అకస్మాత్తుగా ఆ యింట్లోకి ఊడిపడ్డాడు. ఆయన ఎడం చేతిలో బజ్జీల ప్లేటు వుంది. కుడిచేతిలో ఈగలు తోలే కర్రగుడ్డ వుంది.

లక్ష్మీబాయి ఇక ఊరుకోలేకపోయింది. ఏమీ చేతకాని సన్నాసి అని తన భర్త గురించి ఇన్నేళ్ళూ తన తరుపువాళ్ళు అనుకుంటున్నది అసత్యమేమో అన్న రియలైజేషన్ ఆమెని పీడించసాగింది. వెంటనే తన చేతిలో వున్న కార్డ్‌లెస్ ఫోన్ తీసికెళ్ళి చాలా నిబ్బరంగా ప్రశాంతంగా ఆవకాయబద్ద చప్పరిస్తున్న భర్తకి అందించింది.

ఇండిపెండెంటు -"హలోసార్...యువర్ హైనెస్" అన్నాడు వినయంగా. ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా చాలా వాత్సల్యంగా మాట్లాడారు. ఆయన ఇంగ్లీషులో మాట్లాడిన సారాంశం తెలుగులో ఇదీ-

మీరు విపులంగా నిన్న పంపిన రెండు పేజీల టెలిగ్రామ్‌ని చదివాక నేను గర్వంతో ఉప్పొంగిపోయాను. ఒక ప్రజాప్రతినిధి, ఇంత నిజాయితీగా దేశం గురించి ఆలోచిస్తూ, మానసికంగా స్ట్రగుల్ అవుతున్నాడని (స్వాతంత్ర్యం వచ్చిన 50 ఏళ్ళ తర్వాత కూడా ) తెలిశాక, నాకున్న పరిధిలో మిమ్మల్ని ఏ గౌరవ వాచకంతో సంబోధించాలి అని కూడా తెలియక, చాలా కన్‌ఫ్యూజ్ అయ్యాను. మీరు లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారానికి కూడా స్వయంగా రాక, (లేక రాలేక) మీ ప్రమాణ స్వీకార పత్రాన్ని స్పీడు పోస్టులో పంపినందుకు నేను మిమ్మల్ని అభినందిస్తున్నాను. నేను కొంచెం చింతిస్తున్న విషయమేదంటే- నేను మీలాంటి మానవతావాదిని స్వయంగా చూడలేకపోతున్నందుకు. కనీసం, కొద్ది రోజుల్లో జరిగే 'బలపరీక్ష'కు కూడా మీరు రావడానికి ఇష్టపడక రాజకీయాలకి అతీతంగా లోక్‌సభ సభ్యుడిగా, మీరు ఎన్నికైన అతితక్కువ రోజుల్లోనే మీ రాజీనామాపత్రాన్ని నాకు టెలిగ్రాఫ్ మెసేజ్ ద్వారా పంపించటం- రియల్లీ ఐ ఎప్రిషియేట్ యూ. మీకు మరోసారి అభినందనలు తెలుపుకుంటున్నాను.

ఫోను పెట్టేసిన చప్పుడు.

హాల్లో టెలిఫోన్‌లో ఈ సంభాషణంతా విన్న లక్ష్మీబాయి కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. ఆలసత్వో, తనూ తన వాళ్ళు ఎలా ప్రవర్తించిందీ మననం చేసుకొని పశ్చాత్తాపంతో భర్తని కౌగిలించుకుని ఆర్తిగా మొహం దాచుకుంది.